జగిత్యాల జిల్లా కేంద్రంలో రోడ్ షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

చొప్పదండి: కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుంకెరవిశంకర్

వేములవాడ రూరల్: మండలంలో చల్మెడ ప్రచార ర్యాలీలో భారీగా పాల్గొన్న జీఆర్ఎస్ నాయకులు



వేములవాడ రూరల్: మహిళను ఓటు అభ్యర్థిస్తున్న జీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

రాయికల్: రామాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ కుమార్

ఈ నెల 25న కోరుట్లలోనిర్వహించిన రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

బీఆర్ఎస్‌దే హవా

గెలుపు ధీమాలో శ్రేణులు

- నెల రోజులుగా హోరెత్తిన ప్రచారం
- సీట్లు ఖరారు నుంచే రంగంలోకి గులాబీ అభ్యర్థులు
- మూడు నెలల నుంచి ప్రజలతో మమేకం
- చేసిన అభివృద్ధి.. చేయబోయే పనులను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన
- అభినేత ప్రజా ఆశీర్వాద సభలతో ఫుల్ జోష్
- ప్రసంగాలతో ఆలోచన రేకెత్తించిన సీఎం కేసీఆర్
- 24గంటల కరెంట్, ధరణి, ఓటు హక్కు వినియోగంపై జోరుగా చర్చ
- ముఖ్యమంత్రి హామీలపై సంపూర్ణ విశ్వాసం
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత సభలు, రోడ్‌షోలతో ఉత్సాహం
- సకల జనుల నుంచీ పెరిగిన మద్దతు
- ముగిసిన ప్రచారం.. ఆఖరి రోజున హోరాహోరి

కోరుట్ల: ఈ నెల 3న కోరుట్లలో ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన అశేషజనవాహిని, అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ఎండపల్లి మండలంలో పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి పట్టణంలో వీఖివీధినా తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో అంతర్గాంగంగా ఉన్న మండలాల్లో గులాబీ దళం ప్రచారం హోరెత్తింది. నెల రోజులుగా ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదుగంటలకు ముగిసింది. జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ తన ప్రచారాన్ని జగిత్యాల పట్టణంలో ముగించగా, ధర్మపురి అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మారం మండల కేంద్రంలో, కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మెట్‌పల్లి పట్టణాల్లో రోడ్డుషోలతో ముగించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మరునటి రోజు నుంచే ఆరంభమైన ఎన్నికల ప్రచార పర్వం రోజురోజుకూ ఉధృతమవుతూ మంగళవారంతో ముగిసింది. దాదాపు నెల రోజుల పాటు సాగిన బీఆర్ఎస్ ప్రచారంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నుంచి మొదలు కొని స్టార్ క్యాంపెయినర్లు అయిన బడేశాబ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.

మలుపుతిప్పిన సీఎం కేసీఆర్ సభలు..

జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో మూడు భారీ బహిరంగ సభలు జరుగగా, సీఎం కేసీఆర్ కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ప్రచార ఘట్టం ప్రారంభమైన తర్వాత మొదటి సారి నవంబర్ 2న ధర్మపురి జూనియర్ కాలేజీలో జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేసిన సీఎం కేసీఆర్ ధర్మపురి నియోజకవర్గంలో ఉన్న దళిత కుటుంబాలన్నింటికీ ఒకేసారి సాచ్యురేషన్ పద్ధతిలో దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తానని ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గంలో ఉన్న దళితులతో పాటు ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. సీఎం దళితబంధు ప్రకటనతో ధర్మపురి నియోజకవర్గంలో పరిస్థితులు మారిపోయాయి. నవంబర్ 3న సీఎం కేసీఆర్ కోరుట్ల బహిరంగ సభలో పాల్గొన్నారు. కోరుట్ల బహిరంగ సభలో కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల యువకుడని, ప్రజాసేవ కోసం వస్తున్నాడని, ఆమరణదీక్ష సమయంలో తన వెంట ఉండి అనుక్షణం కాపాడాడంటూ పేర్కొనడంతో పాటు, బీడీ కార్మికులందరికీ కటాఫ్ డేట్ లేకుండా పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించడం, చేనేత కార్మికులకు బడ్జెట్ పెంచుతామని ప్రకటించడం పెద్ద మార్పును తీసుకువచ్చింది. ఇక నవంబర్ 26న జగిత్యాల నియోజకవర్గంలో బహిరంగ సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్ తెలంగాణలో జగిత్యాల కల్లోలిత ప్రాంతం కావడం, ఇందిరమ్మ కాలంలో ఎమర్జెన్సీ ప్రకటించడం, నక్సలైట్ల పేరిట కాల్చిచంపడానికి వివరించడంతో పాటు, జగిత్యాల పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టంను ఏర్పాటు చేయిస్తామని, అలాగే డాక్టర్ సంజయ్‌కుమార్ కోరిన అన్ని అంశాలను మంజూరు చేస్తామని పేర్కొనడం ప్రజల్లో మంచి సానుకూలతను పెంచింది. మొత్తంగా సీఎం కేసీఆర్ మూడు భారీ బహిరంగ సభలు బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి బాటలు వేశాయి.

నాలుగు చోట్ల మంత్రి కేటీఆర్ ప్రచారం.. కోరుట్లకు ఒకసారి హరీశ్‌రావు

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాలో నాలుగు చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్టోబర్‌లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్న సమయంలోనే జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 4520 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించిన కేటీఆర్, ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొన్నారు. అదే రోజు ధర్మపురిలో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించి బహిరంగసభలో ప్రసంగించారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించిన కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సిన అవశ్యకతను వివరించారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ మండల కేంద్రంలో భారీ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని విన్నవించారు. వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని సిరిసిల్లల అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఇక మంత్రి తన్నీరు హరీశ్‌రావు అక్టోబర్‌లో కోరుట్ల పట్టణంలో భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో రోడ్డుషోల్లో ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఆయా అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రచారం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు జగిత్యాల, కోరుట్లలో గులాబీ శ్రేణులను సన్నద్ధం చేసే సభల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత తదుపరి రోడ్డుషోల్లో పాల్గొని ప్రచారం చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో రెండ్రోజుల్లో దాదాపు 15 చోట్ల రోడ్డుషో ప్రసంగాలు చేశారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి రాయికల్, జగిత్యాల పట్టణాల్లో రోడ్డుషో కార్యక్రమాల్లో పాల్గొని ప్రచారం చేశారు. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని పెగడపల్లి, కోరుట్ల, ధర్మపురిలో రోడ్డుషోలో పాల్గొన్నారు. ప్రతి సభలోను బీఆర్ఎస్ మ్యానిఫిస్టోలోని అంశాలను వివరించడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ అవశ్యకతను ఆమె ప్రజలకు ఓపికగా వివరించే ప్రయత్నం చేశారు. కాగా, స్టార్ క్యాంపెయినర్లతో పాటు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దాప వసంత, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్ సైతం నిరంతరం ప్రచారంలో పాల్గొన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, సుంకె రవిశంకర్, చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఉదయం నుంచి రాత్రి పదిగంటల దాకా ప్రజలను కలిసి ప్రచారం చేశారు.

ఆఖరి రోజు అదే జోరు

దాదాపు రెండు నెలలుగా అలుపెరుగని ప్రచారంతో జనంతో మమేకమైన గులాబీ అభ్యర్థులు, ఆఖరి రోజు మంగళవారం అదే జోరుగా కలియదిరిగారు. ధర్మపురి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధర్మపురిలో పట్టణంలో ప్రచారం చేశారు. ఎండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేశారు. వీఖివీధినా కలియదిరిగి ఓటు అభ్యర్థించారు. అజగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ ఉదయాన్నే జగిత్యాల పట్టణంలో మున్సిపల్ పార్కులో వాకర్స్‌ను కలిశారు. రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో కలియదిరిగారు. అలాగే ఎమ్మెల్సీ కవితతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కల్వకుంట్ల కోరుట్ల పట్టణంలోని స్వర్ణకార సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు.